# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 122 15-5-2026 వెల: రూ.2/- పేజీలు: 06







## సతీశన్ ఆచరణాత్మక రాజకీయవేత్త



- సీఎల్పీ నాయకుడిగా ఎంపిక
- కేరళ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ప్రకటన
- అధిష్టానం నిర్ణయం పట్ల తీవ్ర అసంతృప్తిలో రమేశ్ చెన్నితాల!
- ఐయూఎంఎల్ ఒత్తిడితోనే సతీశన్ ఎంపిక
- క్షేత్రస్థాయిలో అండగా నిలిచిన నేతలు, కార్యకర్తలు
- 18న సీఎంగా ప్రమాణ స్వీకారం

2లో



## ఉత్తర్ ప్రదేశ్‌లో తుఫాను బీభత్సం..

- ఒక్క రోజే 100 మంది మృతి..
- హోరు గాలులు, వర్షంతో అల్లాడిన యూపీ..
- థండర్‌స్క్వాల్ ఎఫెక్ట్ కారణమని చెబుతున్న నిపుణులు..

ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాన్ని భారీ వర్షాలు, తుఫాన్ అతలాకుతలం చేసింది. బుధవారం రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. ఈ వర్ష బీభత్సానికి రాష్ట్రంలో 100 మంది మరణించారు. ఒక్క ప్రయాగ్‌రాజ్‌లోనే 21 మంది మృతి చెందారు.

2లో



## తైవాన్ కోసం యుద్ధానికైనా సిద్ధమే!

- అమెరికా సరిగ్గా వ్యవహరించకపోతే ఘర్షణ తప్పదు
- డొనాల్డ్ ట్రంప్‌కు తేల్చిచెప్పిన చైనా అధినేత జిన్‌పింగ్
- బీజింగ్‌లో సమావేశమైన ఇరువురు నేతలు
- ఇరాన్ యుద్ధం, ఇంధన భద్రత, వాణిజ్యంపై విస్తృత చర్చలు
- సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయం
- ఇరాన్ అణ్వాయుధాలు సొంతం చేసుకోవడానికి వీల్లేదని స్పష్టీకరణ
- వైట్‌హౌస్‌ను సందర్శించాలని జిన్‌పింగ్ దంపతులకు ట్రంప్ ఆహ్వానం

## స్థానిక ఎన్నికలపై జనసేన కసరత్తు

- విస్తృతస్థాయిలో పార్టీ నేతల సమీక్షలు
- నేడు సాధక్‌లతో పవన్ కళ్యాణ్ భేటీ



2లో

### నీట్-యూజీ2026 రద్దు...

# మోడీ సర్కార్ ఫెయిల్

**యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన మోదీ సర్కారు**



- పేపర్ లీకైతే సంబంధిత మంత్రిపై చర్యలు తీసుకోరా?
- మోడీ హయాంలోనే 93 పేపర్లు లీక్
- ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు
- కేంద్రం తీరుపై ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్,మే14: నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్షరద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గతపదేండ్లుగాప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాం÷-రతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన

- మిగతా 2వ పేజీలో



## మరోసారి లాయరైన మమత

- టీఎంసీ కార్యకర్తలు, మైనారిటీలపై దాడులు జరిగాయి
- ఎన్నికల అనంతర హింసపై కలకత్తా హైకోర్టులో వాదనలు
- శాంతిభద్రతలను కాపాడాలంటూ ప్రభుత్వానికి కోర్టు ఆదేశం

2లో



## ఒకే ఒక్క ఫొటోతో రూమర్లకు ఫుల్‌స్టాప్ పెట్టిన కొడాలి నాని

- తాడేపల్లిలో వైఎస్ జగన్‌తో భేటీ అయిన కొడాలి నాని
- పార్టీ మారతారన్న ప్రచారానికి ఫొటోతో సమాధానం
- ఇటీవల బీజేపీ ఎమ్మెల్యేతో ఆలయాల సందర్శనతో పెరిగిన ఊహాగానాలు
- పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చర్చించినట్లు వెల్లడి

### ఫార్ములా ఈ-కార్ రేసు...

## కేటీఆర్‌కు నోటీసులు

- కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు
- జూలై 31న విచారణకు హాజరు కావాలని ఆదేశం
- ఫార్ములా ఈ రేస్ కేసులో ఏ1గా కేటీఆర్

2లో



# పన్ను ఎగవేతలకు ఏఐ అస్త్రం..

- ఆదాయ వృద్ధికి సీఎం చంద్రబాబు కొత్త వ్యూహం
- పన్ను ఎగవేతలను అరికట్టేందుకు ఏఐ టెక్నాలజీ వినియోగం
- 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.1,27,506 కోట్ల ఆదాయం లక్ష్యం
- ఖనిజాలకు విలువ జోడించి ఆదాయం పెంచుకోవాలని సూచన
- పన్ను చెల్లింపుదారులను వేధించకుండా టెక్నాలజీతో వసూళ్లు చేయాలని ఆదేశం
- ఎర్రచందనం ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించేలా ప్రణాళిక

2లో

పన్ను ఎగవేతలను అరికట్టి, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న లీకేజీలను సమూలంగా మూసివేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని ఒక ఆయుధంగా వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, గనులు, రవాణా వంటి కీలక శాఖల్లో ఏఐ ఆధారిత టూల్స్ వాడటం ద్వారా పన్ను ఎగవేతలను గుర్తించి, నిబంధనల ఉల్లంఘనలను నివారించాలని స్పష్టం చేశారు. ఏఐ ఆధారిత జీఎస్టీ రిటర్న్ స్క్రూటినీ వంటి విధానాలతో పారదర్శకత పెంచాలని, అయితే పన్ను చెల్లింపుదారులను ఎలాంటి వేధింపులకు గురిచేయకుండా టెక్నాలజీ సాయంతో వసూళ్లు జరపాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

- మిగతా 2వ పేజీలో





## అక్షర ఉత్సవం.. ప్రభుత్వ బడుల వైపు అడుగులు!

- లింగోజిగూడెంలో ఘనంగా బడి బాట కార్యక్రమం

**తొలివెలుగు, చౌటుప్పల్:** విద్యా కుసుమాలను వికసింపజేయడమే లక్ష్యంగా, గ్రామంలోని ప్రతి చిన్నారీ బడి గడప తొక్కాలన్న సదుద్దేశంతో జెడ్పీహెచ్ఎస్ లింగోజిగూడెం ఆధ్వర్యంలో 'బడి బాట' కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా సాగింది. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే పటిష్టమైన పునాదులని చాటిచెబుతూ ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు కలిసి గ్రామంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. "పిల్లలందరినీ బడికి పంపిద్దాం - బంగారు భవిష్యత్తును అందిద్దాం" అన్న నినాదాలతో గ్రామంలోని వీధులు మారుమోగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపాలిటీ కౌన్సిలర్ లావణ్య సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు వరప్రదాయినిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందుతుందని, దీన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, రుచికరమైన మధ్యాహ్న భోజన పథకం వల్ల పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతోందని వివరించారు. ఇంటింటికీ వెళ్లి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, వారిని బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూరెళ్ల శ్రీనివాస్, మాధవ రెడ్డి, అరుణ, పురుషోత్తమ చారి, విజయలక్ష్మి, రమేష్ రెడ్డి, బండి అనిల్ కుమార్ రెడ్డి తదితరులు చురుగ్గా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల చొరవ పట్ల గ్రామస్తులు, తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది.

## ప్రతిభకు పట్టాభిషేకం.. పది టాపర్లకు ఘన సన్మానం

- సరస్వతి విద్యాలయం విద్యార్థుల విజయఢంకా



**తొలివెలుగు, ఆత్మకూర్ (ఎం):** పట్టుదలతో చదివితే ఆశించిన ఫలితాలు సాధ్యమేనని ఆత్మకూరు మండల కేంద్రంలోని సరస్వతి విద్యాలయం విద్యార్థులు నిరూపించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం గురువారం ఘనంగా సన్మానించింది. 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం ప్రత్యేక అభినందనలు తెలిపింది.

**ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వీరే:**

పాఠశాలలో అత్యధికంగా అవిశెట్టి దేవిలత (580), రంగ సింధూర (577), దీగోజు విష్ణు ప్రసాద్ (569), దంతూరి సుధీక్ష (566), కోరే ఉషశ్రీ (565), యాస సుధాకర్ రెడ్డి (549), తుమ్మల రుచిత (549), కె. అక్షర (544), మజ్జిగ పరుశరాములు (535), బి. తేజశ్రీ (517), బండారి సింధు (515) మార్కులు సాధించి పాఠశాలకు కీర్తి తెచ్చారు.

**చదువే ఉన్నత మార్గం:**

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తొర్ర విష్ణు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువు ఒక్కటే ఏకైక మార్గమని పేర్కొన్నారు. సమాజంలో గౌరవ మర్యాదలు విద్యతోనే లభిస్తాయని, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ పంజాల నర్సయ్య మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారం అలవరుచుకోవాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి. లలిత, ఆర్. సంతోష, ఎండీ యాసీన్, కే. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


## రాజాపేటలో 'బీర్ల' పుట్టినరోజు సంబరాలు

**తొలివెలుగు, రాజాపేట:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర కార్యదర్శి బీర్ల శంకర్ జన్మదిన వేడుకలను గురువారం రాజాపేట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. నెమిల గ్రామ ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. స్థానిక మహాత్మా గాంధీ చౌరస్తా వద్ద ఇందిరమ్మ కమిటీ సభ్యులు ధర్మ హరినాథ్ రెడ్డి నేతృత్వంలో ఈ వేడుకలు కోలాహలంగా జరిగాయి. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యకర్తలు బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతకుముందు మండల స్థాయి కాంగ్రెస్ నాయకులంతా బీర్ల శంకర్‌కు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, పార్టీ బలోపేతంలో ఆయన చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పలువురు నాయకులు కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నెమిల గ్రామ సర్పంచ్ పులి రాజు ముదిరాజ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జెట్ట సిద్దులు, గుడుకుంట్ల తిరుపతి రెడ్డి, పాల్వాయి భరత్ రెడ్డి, శిల బాలమల్లయ్య, గవ్వల నర్సింహులు, జైతరం శ్రీనివాస్ రెడ్డి, పాల్వాయి ఉపేందర్ రెడ్డిలతో పాటు పలువురు మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



# పల్లెల్లో మట్టి మాఫియా పంజా!

- చెరువుల భక్ష్యణకు బడా వ్యాపారి భారీ స్కెచ్
- అడ్డగోలుగా తరలిస్తే ఊరుకునేది లేదంటున్న రైతన్నలు
- పంచాయతీలో ఫలించని ఏకగ్రీవ తీర్మానాల కుట్రలు
- అధికారులను బొక్కలో వేసుకుంటానంటున్న 'మట్టి' బకాసురుడు
- వెంకటాపురంలో వార్డు సభ్యుల 'మిస్సింగ్' వెనుక వ్యూహం!
- 'మేనేజ్' పాలిటిక్స్‌తో చక్రం తిప్పుతున్న పక్క మండల వ్యాపారి
- జిల్లా కలెక్టర్‌కు నమిల, వెంకటాపురం ప్రజల మొర






**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల పరిధిలోని చెరువుల నుంచి మట్టి తరలింపు వ్యవహారం రోజురోజుకూ ఉద్రిక్తతకు దారితీస్తోంది. నమిల, దూది వెంకటాపురం గ్రామాల్లో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న మట్టి రగడ గ్రామస్తులు, రైతుల మధ్య తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. చెరువుల్లోని మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల కోర్టులోకి 'నమిల' బంతి:**

నమిల గ్రామ పరిధిలోని ఊర చెరువు నుంచి మట్టి తరలింపు అంశంపై గ్రామస్తులు ఏకాభిప్రాయానికి రాకపోవడంతో గ్రామపంచాయతీ పాలకవర్గం పంచాయతీ కార్యదర్శి సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. సుదీర్ఘ చర్చల అనంతరం మట్టి తొలగింపు అంశాన్ని జిల్లా అధికారుల నిర్ణయానికే వదిలేయాలని తీర్మానించారు.

రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ (ఐబీ) శాఖల నుంచి అధికారిక అనుమతులు వచ్చిన తర్వాతే చెరువులో మట్టి తవ్వకాలకు అనుమతి ఇవ్వాలని పాలకవర్గం స్పష్టం చేసింది. అనుమతులు లేకుండా ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

**వెంకటాపురంలో వీడని సందిగ్ధం:**

దూది వెంకటాపురం గ్రామ పరిధిలోని చెరువులో మట్టి తొలగింపు వ్యవహారం కూడా వివాదంగా మారింది. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీలతో తవ్వించిన మట్టిని స్థానిక రైతుల పొలాలకు తరలిస్తున్నప్పటికీ, ఇటీవల ఇతర ప్రాంతాలకు కూడా మట్టిని తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ ఏకగ్రీవ తీర్మానం కోసం పంచాయతీ కార్యదర్శి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో పరిస్థితి మరింత సంక్లిష్టమైంది. కొందరు వార్డు సభ్యులు ఉద్దేశపూర్వకంగానే సమావేశాలకు హాజరుకాకపోవడంతో తీర్మానం నిలిచిపోయినట్లు సమాచారం. పాలకవర్గం ఏకగ్రీవ నిర్ణయం తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

**'సారు'లంతా నా జేబులోనే:**

ఇదిలా ఉండగా, ఇతర మండలానికి చెందిన ఓ మట్టి వ్యాపారి రెండు చెరువుల నుంచి మట్టి తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గ్రామాల్లో ప్రచారం జరుగుతోంది. "అధికారులను మేనేజ్ చేసుకుని అనుమతులు తెచ్చుకుంటాను" అంటూ సదరు వ్యాపారి దబాయిస్తున్నట్లు సమాచారం. ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే మట్టిని తరలించేందుకు సిద్ధమవుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అక్రమ మట్టి రవాణాను అడ్డుకోవాలని నమిల, వెంకటాపురం గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు ఇటీవల నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువులను పరిరక్షించి, అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే సహించబోమని రైతులు హెచ్చరిస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సొంతింటి కల సాకారం


- దశలవారీగా అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్
- 10వ వార్డులో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

**తొలివెలుగు, చౌటుప్పల్:** పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చాలన్న దృఢ సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డుకు చెందిన రాపర్తి మంజుల-సైదులు గౌడ్ దంపతులకు మంజూరైన నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్, స్థానిక కౌన్సిలర్ దేప రమ్యలతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. నిరుపేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం పేదవారికి ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి పక్షపాతం లేకుండా దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. గృహప్రవేశం అనంతరం లబ్ధిదారులైన రాపర్తి సైదులు గౌడ్-మంజుల దంపతులు మున్సిపల్ చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్, కౌన్సిలర్ దేప రమ్య, నాయకుడు దేప రాజులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో షాదీఖానా చైర్మన్ షేక్ కరీం, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు కోలాన్ వినోద, 10వ వార్డు అధ్యక్షులు పోలోజు శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షులు కానుగు మధు, రాపర్తి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



## చల్లూరులో వైభవంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

- పాల్గొన్న సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య
- పట్టువస్త్రాలతో లబ్ధిదారుల దంపతులకు సత్కారం



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలంలోని చల్లూరు గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం పండగ వాతావరణంలో ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన గణపురం తుకారం - సువర్ణ దంపతులు నిర్మించుకున్న నూతన గృహ ప్రవేశ మహోత్సవానికి గ్రామ సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిబ్బన్ కత్తిరించి గృహప్రవేశాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల నెరవేరడం సంతోషదాయకమన్నారు. అనంతరం, గణపురం తుకారం - సువర్ణ దంపతులను సర్పంచ్ దంపతులు ఆశీర్వదించి, వారికి నూతన పట్టువస్త్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొంత సుధాకర్, పలువురు వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ముందడుగులో 'సింగారం' విద్యార్థిని.. 'రాజాపేట' మాస్టారు!

- ఎఫ్.ఆర్.ఎస్ హాజరులో మండల టాపర్లుగా గుర్తింపు
- బొల్లు కీర్తన, రామలింగాచారికి అధికారుల అభినందనలు



**తొలివెలుగు, రాజాపేట:** పాఠశాలల్లో అమలు చేస్తున్న ముఖ గుర్తింపు ఆధారిత హాజరు (ఎఫ్.ఆర్.ఎస్) విధానంలో రాజాపేట మండలానికి చెందిన ఒక విద్యార్థిని, ఒక ఉపాధ్యాయుడు మండల స్థాయిలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలిచారు.

**ప్రథమ స్థానంలో కీర్తన:**

మండలంలోని సింగారం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బొల్లు కీర్తన, మొత్తం 189 పని దినాలకు గాను 124 రోజులు ఎఫ్.ఆర్.ఎస్ హాజరుతో మండల టాపర్గా నిలిచింది. విద్యార్థులలో అత్యధిక హాజరు శాతం నమోదు చేసినందుకు ఆమెను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

**ఆదర్శంగా ఉపాధ్యాయుడు:**

అదేవిధంగా, ఉపాధ్యాయుల విభాగంలో రాజాపేట హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రామలింగాచారి తన నిబద్ధతను చాటుకున్నారు. 127 రోజులకు గాను 119 రోజులు ఎఫ్.ఆర్.ఎస్ హాజరుతో మండలంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కందుల సత్యనారాయణ, మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్ వీరిద్దరినీ ప్రశంసించి, ఇతర పాఠశాలల వారు వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

# మిల్లుల వద్ద వెంటనే ధాన్యం దిగుమతి



- ఏ రోజు లారీ ఆ రోజే అన్‌లోడ్ చేయాలి
- కొనుగోళ్లలో జాప్యానికి తావివ్వొద్దు
- యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలు
- ఎస్పీతో కలిసి అంకిరెడ్డిగూడెంలో రైస్ మిల్లు తనిఖీ
- చౌటుప్పల్ మార్కెట్ యార్డులో ధాన్యం పరిశీలన

**తొలివెలుగు, చౌటుప్పల్:** రైస్ మిల్లుల వద్దకు ధాన్యం లోడుతో వచ్చే లారీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను, మిల్లర్లను ఆదేశించారు. గురువారం చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెంలోని మల్లికార్జున రైస్ మిల్లును జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులో ధాన్యం లారీల నిరీక్షణ, దిగుమతి ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. మిల్లుకు రోజూ ఎన్ని లారీలు వస్తున్నాయి? అన్‌లోడ్ చేయడానికి ఎంత సమయం పడుతోంది? సరిపడా హమాలీలు ఉన్నారా? తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. హమాలీల కొరత ఉంటే వెంటనే అదనపు సిబ్బందిని



ఏర్పాటు చేసుకుని దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని యాజమాన్యానికి సూచించారు. రైతులు రోజుల తరబడి నిరీక్షించే పరిస్థితి రావొద్దని, ఏ రోజు వచ్చిన లారీని ఆ రోజే అన్‌లోడ్ చేసి పంపించాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మిల్లుల వద్ద ధాన్యం వాహనాలు నిలిపి ఉంచడానికి వీల్లేదన్నారు.

**తేమ శాతం రాగానే కాంటా వేయాలి:**


రైస్ మిల్లు తనిఖీ అనంతరం, చౌటుప్పల్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రెవెన్యూ అదనపు కలెక్టర్‌తో కలిసి కలెక్టర్ అనురాగ్ జయంతి ధాన్యం కుప్పలను పరిశీలించారు. యార్డుకు ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది? ఎంత కొనుగోలు చేశారు? అన్న వివరాలపై ఆరా తీశారు. ప్రతిరోజూ ధాన్యంలో తేమ శాతాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలని, నిబంధనల ప్రకారం తేమ శాతం రాగానే ఏమాత్రం జాప్యం చేయకుండా కాంటా వేయాలని ఆదేశించారు. కాంటా పూర్తయిన వెంటనే లారీల ద్వారా రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం నిల్వ ఉంచే పరిస్థితి రాకుండా ఉండేందుకు, యార్డుకు అవసరమైనన్ని అదనపు లారీలను సైతం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- తరుగు పేరిట రైతులపై భారం
- కొనుగోలు కేంద్రాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి



**తొలివెలుగు, వలిగొండ:** ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండలంలోని లింగరాజుపల్లి ఐకేపీ కేంద్రంతో పాటు వలిగొండ మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్వింటాకు రెండు కిలోల చొప్పున తూకంలో కోత విధిస్తూ తరుగు పేరిట రైతులను నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. మిల్లర్లు సైతం రైతులను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి తక్షణమే ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసు నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజీనామాకు సీపీఎం డిమాండ్
- చౌటుప్పల్ బస్టాండ్ ఎదుట వామపక్ష శ్రేణుల నిరసన

**తొలివెలుగు, చౌటుప్పల్:** మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీపీఎం చౌటుప్పల్ మున్సిపల్, మండల కమిటీల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఎదురుగా భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. 17 ఏళ్ల బాలికను మానసికంగా, లైంగికంగా వేధిస్తున్నాడంటూ భగీరథపై పోక్సో కేసు నమోదైనా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. దీని వెనుక తీవ్రమైన రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆయన ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ తన పలుకుబడిని ఉపయోగించి కుమారుడిపై వచ్చిన ఆరోపణలను కప్పిపుచ్చేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. 'బేటీ బచావో–బేటీ పఢావో' అంటూ గొప్పలు చెప్పే కేంద్ర ప్రభుత్వ పెద్దలు, తమ సొంత పార్టీ నేత కుమారుడిపై నిర్భయ చట్టం కింద కేసులు నమోదైతే ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. నైతిక బాధ్యత వహించి బండి సంజయ్ తన మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితుడిని రిమాండ్‌కు తరలించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, నాయకులు చీక సంజీవరెడ్డి, బత్తుల శ్రీశైలం గౌడ్, చీర్క అలివేలు, బోయ యాదయ్య, పొట్ట శ్రీనివాస్, ఆకుల ధర్మయ్య, కందగట్ల ఆనంద్, కొండే శ్రీశైలం, కొంతం శ్రీనివాస్ రెడ్డి, బత్తుల రామచంద్రం, బాలగోని బాలరాజు, ఫకీర్ పెంటారెడ్డి, జగ్గం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ బడుల బలోపేతానికి సహకరించాలి

- దేవలమ్మనాగారంలో 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్'
- విద్యార్థుల నమోదు పెంచడమే లక్ష్యం
- పాల్గొన్న జిల్లా ఏంఈవో జానీ అఫ్గాన్, ఎంఈవో గురువారావు



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలంలో కొనసాగుతున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా గురువారం దేవలమ్మనాగరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఆవరణలో 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్'ను ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాలల బలోపేతం, విద్యార్థుల నమోదు పెంపు లక్ష్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో ఉన్నతాధికారులు ప్రత్యేకంగా చర్చించారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఏఎంవో జానీ అఫ్గాన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. మండల విద్యాధికారి గురువారావు మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరీ శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. నర్సింహ రెడ్డి, ఉన్నత పాఠశాల ఏఏపీసీ చైర్మన్ ప్రియాంక, ప్రాథమిక పాఠశాల ఏఏపీసీ చైర్మన్ సుగుణమ్మ, కార్యదర్శి పద్మజ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి స్వామివారి చిత్రపటం అందజేత

- మర్యాదపూర్వకంగా కలిసిన దేవస్థాన చైర్మన్ శ్యాంసుందర్
- దండు మల్కాపూర్ రామలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల సందర్శన

**తొలివెలుగు, చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపూర్ గ్రామానికి చెందిన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్ గురువారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శ్రీ రామలింగేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేసి ఘనంగా సత్కరించారు. దేవస్థానం అభివృద్ధి, ఆలయ కార్యక్రమాలపై ఎమ్మెల్యేతో చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు దౌడి లింగస్వామి, సిలువేరు శంకర్, ఎల్లంకి లింగాచారి, జెర్రిపోతుల అఖిల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల్లో రసాయన సెగ.. అంతమ్మగూడెం విలవిల!

- భూగర్భంలో విషతుల్యమైన జలాలు
- ఫాస్జీన్ వంటి వాయువులతో ప్రాణాపాయం
- పీల్చే గాలి.. తాగే నీరు అంతా కలుషితమే
- 110 ఏళ్లయినా కోలుకోలేని స్థితిలో భూగర్భ జలాలు: పర్యావరణవేత్తల హెచ్చరిక
- కాలుష్య పరిశ్రమలపై అంతమ్మగూడెం వాసుల పోరు
- మద్దతు తెలిపిన పర్యావరణవేత్త పురుషోత్తం రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్:** పచ్చని పల్లెలు పారిశ్రామిక వ్యర్థాల కోరల్లో చిక్కి విలవిలలాడుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని అంతమ్మగూడెం, చౌటుప్పల్, పోచంపల్లి తదితర ప్రాంతాల్లో రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు ప్రజల పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా భూదాన్ పోచంపల్లి మండలం అంతమ్మగూడెం గ్రామం రసాయన కాలుష్యానికి నిలువునా బలైపోతోంది. ఇక్కడ నెలకొన్న హాజోలా రసాయన పరిశ్రమ విడుదల చేస్తున్న విషతుల్యమైన వ్యర్థాలు భూగర్భ జలాల్లోకి చేరడంతో సుమారు 1200 ఎకరాల విస్తీర్ణంలో భూమి పూర్తిగా విషపూరితమైంది. ఇప్పటికిప్పుడు కంపెనీలను మూసివేసినా, ఇక్కడి నేల తిరిగి సాధారణ స్థితికి రావడానికి మరో 110 ఏళ్లు పడుతుందని పర్యావరణవేత్తలు హెచ్చరించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

**యుద్ధంలో వాడే 'ఫాస్జీన్' వాయువు విడుదల:**

ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కుంభం పురుషోత్తం రెడ్డి ఈ పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో శత్రువులపై ప్రయోగించిన 'ఫాస్జీన్' వంటి ప్రాణాంతక వాయువులను ఈ కంపెనీలు గాలిలోకి వదులుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. దాదాపు 298 రకాల విష వాయువుల వల్ల ప్రజలు క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, బ్రెయిన్ ట్యూమర్ల వంటి ప్రమాదకర జబ్బుల బారిన పడుతున్నారు. ఈ



నేపథ్యంలో 'అంతమ్మగూడెం కాలుష్య విముక్తి పోరాట సమితి' ఆధ్వర్యంలో బాధితులు పోరుబాట పట్టారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరాహార దీక్ష చేపట్టారు. అధికారులు స్పందించకుంటే కలెక్టరేట్, పీసీబీ కార్యాలయాలను ముట్టడిస్తామని పోరాట సమితి నాయకులు గుమ్మి నరేందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి హెచ్చరించారు.

# పంజాబ్ మళ్లీ పల్టీ..

## వరుసగా ఐదో ఓటమితో డీలా



ధర్మశాల : ఐపీఎల్-19లో ప్లేఆఫ్స్ రేసు నుంచి వైదొలిగిన ముంబై ఇండియన్స్ పోతూపోతూ గత ఎడిషన్ రన్నరప్ పంజాబ్ కింగ్స్‌ను దెబ్బకొట్టింది. తిలక్ వర్మ (33 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 75 నాటౌట్) అద్భుత ఆటకు తోడు బౌలింగ్‌లో శార్దూల్ ఠాకూర్ (4/39) సత్తా చాటడంతో గురువారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో పంజాబ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. తొలి ఏడు మ్యాచ్‌ల్లో అజేయంగా నిలిచిన తర్వాత వరుసగా ఐదో ఓటమితో పంజాబ్ మరింత డీలా పడింది. తొలుత పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (32 బంతుల్లో 6 ఫోర్లు,4 సిక్సర్లతో 57) అర్ధశతకంతో రాణించగా, ఆఖర్లో అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (17బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 38) మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించాడు. తర్వాత ముంబై 19.5 ఓవర్లలో 205/4 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ (23 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 48) కూడా సత్తా చాటాడు. తిలక్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

**తిలక్ తడాఖా..**

లక్ష్య ఛేదనలో ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ ముంబైకి అద్భుత ఆరంభం అందించాడు. తొలుత హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ (25) ఇబ్బంది పడినా.. ర్యాన్ మాత్రం భారీ షాట్లతో అలరించాడు. రెండో ఓవర్లో సిక్సర్ల ఖాతా తెరిచిన అతను యాన్సెన్ బౌలింగ్‌లో 4,6,4.. బార్ట్‌లెట్ ఓవర్లో 6,4తో జోరు చూపెట్టాడు. బార్ట్‌లెట్ వేసిన ఆరో ఓవర్లో తను మరో సిక్స్ కొట్టగా.. తొలి 13 బంతుల్లో 6 రన్స్ మాత్రమే చేసిన రోహిత్ కూడా సిక్స్ బాదడంతో పవర్ ప్లేను ముంబై 59/0తో ముగించింది. అయితే, ఫీల్డింగ్ మారిన తర్వాత పంజాబ్ బౌలర్లు పుంజుకున్నారు. ఏడో ఓవర్లో ఆర్య పట్టిన క్యాచ్‌తో రికెల్టన్‌ను ఔట్ చేసిన ఒమర్‌జాయ్ తొలి వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యాన్ని ముగించాడు. వచ్చీ రాగానే ఓ సిక్స్ రాబట్టిన నమన్ ధీర్ (9) యాన్సెన్ బౌలింగ్‌లో అర్ష్‌దీప్‌కు చిక్కాడు. పదో ఓవర్లో సిన్నర్ చహల్ లో లెంగ్త్ బాల్‌తో రోహిత్‌ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో ముంబై 88/3తో డీలా పడింది. ఈ టైమ్‌లో తిలక్ వర్మ జట్టు బాధ్యత తీసుకున్నాడు. వరుస బౌండరీలతో తిలక్ లక్ష్యాన్ని కరిగించే ప్రయత్నం చేశాడు. మరో ఎండ్‌లో రూథర్‌ఫర్డ్ (20)ఇబ్బంది పడటంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ పోయింది. 30 బంతుల్లో 70 రన్స్ అవసరమైన దశలో చహల్ వేసిన 16వ ఓవర్లో తిలక్ 6,4.. రూథర్‌ఫర్డ్ భారీ సిక్స్ బాది 20 పరుగులు రాబట్టి జట్టుపై ఒత్తిడి తగ్గించారు. కానీ, రూథర్‌ఫర్డ్‌ను ఔట్ చేసిన ఒమర్‌జాయ్ పంజాబ్‌ను రేసులోకి తెచ్చాడు. అయినా తిలక్ వెనక్కుతగ్గలేదు. యాన్సెన్ వేసిన 18వ ఓవర్లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్‌తో పంజాబ్ ఆశలపై నీళ్లు చల్లాడు. అదే ఓవర్లో ఓ ఫోర్ రాబట్టిన విల్ జాక్స్ (25 నాటౌట్).. అర్ష్‌దీప్ బౌలింగ్‌లో 6, 4 బాదాడు. చివరి ఓవర్లో ముంబై విజయానికి 15 రన్స్ అవసరం అయ్యాయి. తొలి బాల్‌కు జాక్స్ సిక్స్ కొట్టగా.. తిలక్ వరుసగా రెండు సిక్సర్లతో ముంబైని గెలిపించాడు.

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌కు ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య (27), ప్రభ్‌సిమ్రన్ సింగ్ 33 బంతుల్లోనే 50 పరుగులు జోడించి మంచి ఆరంభాన్నిచ్చారు. ఇన్నింగ్స్ ప్రారంభంలోనే లభించిన జీవనదానాన్ని అందిపుచ్చుకున్న ప్రభ్‌సిమ్రన్ వరుస బౌండరీలతో ముంబై బౌలర్లపై ఎదురుదాడి చేశాడు. ఆరో ఓవర్లో దీపక్ చహర్ నకుల్ బాల్‌తో ప్రియాంశ్‌ను బౌల్డ్ చేసి ఈ జోడీని విడదీశాడు.పవర్ ప్లేను 55/1తో ముగించిన తర్వాత కనోలి (21)తోడుగా ప్రభ్ జోరు కొనసాగించాడు. రఘు శర్మ వేసిన పదో ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టిన అతను కార్బిన్ బాష్ బౌలింగ్‌లో మరో సిక్స్ రాబట్టి ఈ సీజన్‌లో ముంబైపై రెండోసారి ఫిఫ్టీ అందుకున్నాడు. అయితే, 12వ ఓవర్లో మళ్లీ బౌలింగ్‌కు దిగిన శార్దూల్ ఠాకూర్ పదునైన బంతులతో పంజాబ్‌ను గట్టి దెబ్బ కొట్టాడు. మూడు బంతుల వ్యవధిలో ప్రభ్‌సిమ్రన్‌తో పాటు శ్రేయస్ అయ్యర్ (4)ను ఔట్ చేసి మ్యాచ్‌ను ముంబై వైపు తిప్పాడు. ఆ వెంటనే కనోలిని రాజ్ బవా బౌల్డ్ చేయగా.. సూర్యాంశ్ షెడ్గే (8), శశాంక్ సింగ్ (2) నిరాశ పరిచారు. దాంతో 15 ఓవర్లకు 135/6తో పంజాబ్ కష్టాల్లో పడింది. తర్వాతి ఓవర్లో బుమ్రా ఐదు రన్సే ఇవ్వగా.. ఆల్‌రౌండర్ యాన్సెన్ (2)ను బౌల్డ్ చేసిన శార్దూల్ ఆ జట్టును మరో దెబ్బకొట్టడంతో స్కోరు 180 దాటితే గొప్పే అనిపించింది. కానీ, ఒమర్‌జాయ్ అనూహ్యంగా రెచ్చిపోవడంతో ఆఖరి మూడు ఓవర్లలో ముంబై బౌలర్ల వ్యూహాలు ఫలించలేదు. శార్దూల్ ఆఖరి బంతిని స్టాండ్స్‌కు చేర్చిన అతను.. చహర్ వేసిన 18వ ఓవర్లో వరుసగా 4, 6, 6 కొట్టి ఔటయ్యాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన విష్ణు వినోద్ (15 నాటౌట్), జేవియర్ బార్ట్‌లెట్ (18 నాటౌట్) ఫీల్డర్ల తప్పిదాన్ని సొమ్ము చేసుకొని చివరి రెండు ఓవర్లలో 34 రన్స్ రాబట్టడంతో పంజాబ్ ఈ సీజన్‌లో ఎనిమిదోసారి 200 పరుగుల మార్కును దాటగలిగింది.

## భగ్గుమన్న టోకు ధరలు

న్యూఢిల్లీ: టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) ఏప్రిల్‌లో భగ్గుమంది. ముడి చమురు, ఇంధన ధరలు పెరగడంతో 8.3 శాతానికి ఎగబాకినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇది 42 నెలల గరిష్ఠ స్థాయి. మార్చిలో ఉన్న 3.88 శాతంతో పోల్చితే ఒక్క నెల వ్యవధిలోనే భారీగా పెరిగినట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ విడుదల చేసిన తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన ధరలు భారీగా పెరిగిపోవడం, మినరల్ ఆయిల్స్, బేసిక్ మెటల్స్ ధరలు ఎగసిపడడం ద్రవ్యోల్బణం రికార్డు స్థాయికి చేరేందుకు దారితీసింది. 2025 ఏప్రిల్‌లో టోకు ద్రవ్యోల్బణం 0.85 శాతంగా ఉండడం గమనార్హం. అన్ని ప్రధాన రంగాల్లోనూ టోకు ధరలు పెరిగాయి. ప్రధానంగా ఇంధనం, విద్యుత్ రంగంలో ద్రవ్యోల్బణం అత్యధికంగా 24.71 శాతంగా నమోదైంది. మార్చిలో కేవలం 1.05 శాతమే ఉండటం గమనార్హం.





## పెట్రో మంట తప్పదా..?

దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ఇక తప్పదా అనే చర్చ మళ్లీ వేడెక్కుతోంది. పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరిగిన కారణంగా ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికే కోట్లకు పైగా అండర్ రికవరీ వస్తోందని కేంద్ర వర్గాలు చెబుతున్నాయి. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వంటి సంస్థలు గత నాలుగేళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలను పెద్దగా పెంచకుండా కొనసాగిస్తున్నాయి. అయితే ప్రస్తుతం అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ధరలు భారీగా పెరగడం, రూపాయి బలహీనపడటం వల్ల కంపెనీలపై భారం మరింత పెరిగింది. పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్ పురి కూడా ఆయిల్ కంపెనీలు భారీ నష్టాలు భరించలేని స్థితికి వచ్చాయని సంకేతాలు ఇచ్చారు. పరిస్థితి ఎక్కువకాలం కొనసాగితే ధరల సవరణ తప్పనిసరికావచ్చని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కూడా హెచ్చరించారు. అయితే ద్రవ్యోల్బణ భయం కారణంగా కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరల తక్షణ పెంపు నిర్ణయంపై ఇంకా ఆచితూచి వ్యవహరిస్తోంది. కానీ యుద్ధ ఉద్రిక్తతల దెబ్బతో ప్రపంచ మార్కెట్లో పెరిగిపోతున్న ఇంధన రేట్లకు తగ్గట్లు దేశీయంగా పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలను పెంచకపోవడంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) భారీగా ఆదాయాన్ని నష్టపోతున్నాయి. పెట్రోల్‌పై లీటరుకు రూ. 14, డీజిల్‌పై రూ. 42 మేర నష్టాలను పరిగణనలోకి తీసుకుంటే, ప్రస్తుతం నెలకు రూ. 55,416 కోట్ల మేర అండర్ రికవరీలు ఉంటున్నాయని అంచనా. ఈ నష్టాలను తగ్గించుకుని, తిరిగి గతేడాది స్థాయికి చేరుకోవాలంటే పెట్రోల్, డీజిల్ రేట్లను 20 శాతం మేర పెంచాల్సి వస్తుందని పరిశ్రమ వర్గాలు లెక్కలు వేస్తున్నాయి. కనీసం రూ. 10 పెంచితే రూ. 17,000 కోట్ల మేర నష్టం భర్తీ అవుతుందని చెబుతున్నాయి. దేశీయంగా గత రెండు నెలలుగా, ప్రతి నెలా 37 లక్షల టన్నుల పెట్రోల్, 85 లక్షల టన్నుల డీజిల్ వినియోగం ఉంటోంది. దీంతో ఓఎంసీలపై భారం భారీగా పెరిగిపోయింది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆయిల్ కంపెనీలకు నెలకు రూ. 55,416 కోట్ల మేర నష్టాలు వస్తున్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో లీటరుకు రూ. 2 చొప్పున పెంచితే నెలవారీ అండర్ రికవరీలు రూ. 52,105 కోట్లకు, రూ. 4 పెంచితే రూ. 48.794 కోట్లకు తగ్గుతాయని భావిస్తున్నారు. రూ. 10 పెంచితే ఓఎంసీలకు రూ. 17,000 కోట్ల భారం తగ్గుతుందని, ఆదాయ నష్టం సుమారు రూ. 38,863 కోట్లకు దిగి వస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.



## ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టిన శ్రీముఖి..

### హైదరాబాద్‌లో కొత్త రెస్టారెంట్ ప్రారంభం

టాలీవుడ్ ప్రముఖ యాంకర్, నటి శ్రీముఖి ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న క్యాపిటల్ పార్క్‌లో తన స్నేహితులు శ్రావణ్, ఆనంద్, రవిలతో కలిసి 'ఫుర్సత్ అనే రెస్టారెంట్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా శ్రీముఖి మాట్లాడుతూ.. తనకు భోజనం అంటే చాలా ఇష్టమని, ముఖ్యంగా బిర్యానీ, చికెన్ కర్రీలతో పాటు వెజిటేరియన్ వంటకాలను కూడా ఆస్వాదిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చి ప్రశాంతంగా గడిపేలా, ఒక మంచి అనుభూతిని అందించేలా ఫుర్సత్‌ను తీర్చిదిద్దినట్లు ఆమె వివరించారు. ఈ రెస్టారెంట్‌లో సుమారు 300 మంది కూర్చునే సదుపాయంతో పాటు ప్రత్యేకమైన బ్యాంక్వెట్ హాల్స్ కూడా ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. నల్లి గోష్ట్ బిర్యానీ వంటి ప్రత్యేక వంటకాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, సరసమైన ధరలకే నాణ్యమైన ఆహారాన్ని అందించడమే తమ లక్ష్యమని శ్రీముఖి పేర్కొన్నారు. భాగస్వాములు శ్రావణ్, ఆనంద్, రవి మాట్లాడుతూ.. రుచి, సేవలలో ఎక్కడా రాజీ పడకుండా సంప్రదాయ, ఆధునిక వంటకాల కలయికతో మెనూని రూపొందించామని చెప్పారు. కార్పొరేట్ సమావేశాలకు, కుటుంబ వేడుకలకు ఫుర్సత్ ఒక ఉత్తమ గమ్యస్థానంగా మారుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. వినూత్నమైన డైనింగ్ కాన్సెప్ట్‌తో ప్రారంభమైన ఈ రెస్టారెంట్, శ్రీముఖి భాగస్వామ్యంతో హైదరాబాద్ ఆహార ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



## ముందు అనుకున్నారు.. ఫైనల్‌గా ఫిక్స్ చేశారా?

రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న సినిమా 'పెద్ది'.. మరో నెల రోజుల్లో థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే షూటింగ్ నడుస్తుండటంతో వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని రూమర్స్ వస్తున్నాయి. మరోవైపు చరణ్ పుట్టినరోజున ఓవర్సీస్ బుకింగ్స్ ఓపెన్ అవుతాయని అధికారికంగా ప్రకటించడంతో వాయిదా లాంటిది లేదని పరోక్షంగా క్లారిటీ ఇచ్చినట్లయింది. అయితే ఈ మూవీలోని ఐటమ్ సాంగ్ ఎవరు చేస్తారా అనే ప్రశ్న కూడా ఇంకా అలానే మిగిలిపోయింది. ఫైనల్‌గా దానికి సమాధానం దొరికేసినట్లు కనిపిస్తోంది. గతంలో 'పెద్ది' ఐటమ్ కోసం పూజా హెగ్డే, ఆయేషా ఖాన్, మృణాల్ ఠాకుర్.. ఇలా చాలా పేర్లు వినిపించాయి. కానీ పాట షూటింగ్ ఇంకా బ్యాలెన్స్ ఉండేసరికి ఎవరిని తీసుకున్నారనే విషయం బయటకు రాలేదు. చివరకు ఇప్పుడు ముందు అనుకున్న వాళ్లలో మృణాల్ ఠాకుర్‌ని ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో ఈమె హీరోయిన్‌గా చేసిన 'డకాయిట్' రిలీజ్ కానుంది. దీని ప్రమోషన్స్‌లో పాల్గొనేందుకు ప్లస్ 'పెద్ది' సాంగ్ చేసేందుకుగానూ రాబోయే కొన్నిరోజులు ఈమె హైదరాబాద్‌లోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ ఐటమ్ పాటలో చరణ్-మృణాల్‌తో పాటు జాన్వీ కపూర్ కూడా కాసేపు కనిపిస్తుందని అంటున్నారు. బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ విలేజ్ డ్రామాగా తెరకెక్కించారు. కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు చేశారు. ఏఆర్ రెహమాన్ సంగీతమందించాడు. ఇప్పటికే రెండు పాటలు రిలీజ్ కాగా రెండూ సూపర్ హిట్ అయ్యాయి.



## ధనుష్‌కి జోడీగా రుక్మిణి..

తక్కువ టైంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్. సొంత భాషలో హిట్స్ ఉన్నప్పటికీ తెలుగు, తమిళంలో చేసిన చిత్రాలన్నీ డిజాస్టర్స్ అయ్యాయి. ప్రస్తుతం ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబోలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీలో హీరోయిన్‌గా చేస్తోంది. అయితే తమిళంలో చేసిన మూవీస్ ఫ్లాప్ అయినప్పటికీ.. ఇప్పుడు రుక్మిణి మరో అవకాశం దక్కించుకున్నట్లు తెలుస్తోంది. వరుస సినిమాలతో అలరిస్తున్న తమిళ హీరో ధనుష్.. ప్రస్తుతం విఘ్నేశ్ రాజా దర్శకత్వంలో 'కర' మూవీ చేశాడు. మమిత బైజు హీరోయిన్. వచ్చే నెల 30న థియేటర్లలోకి రానుంది. మరోవైపు 'అమరన్' తీసిన రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలోనూ ధనుష్ ఓ సినిమా చేస్తున్నాడు. డీ55 పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో సాయిపల్లవి, శ్రీలీల హీరోయిన్స్. సాయి అభయంకర్ సంగీతాన్ని అందిస్తున్నాడు. దీని తర్వాత ధనుష్ మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'లబ్బర్ పందు' ఫేమ్ తమిళసన్ పచ్చముత్తు దర్శకత్వం వహించనున్నట్లు టాక్. ఇందులోనే దక్షిణాది క్రేజీ హీరోయిన్ రుక్మిణి వసంత్.. ధనుష్ సరసన నటించనుందట. ఇదే నిజమైతే వీళ్లిద్దరి కాంబోలో రూపొందే తొలి చిత్రం ఇదే అవుతుంది. ఈ ?ప్రాజెక్టుకి అనిరుధ్ సంగీంతమందించనున్నాడట. ఇందులో ప్రతినాయకుడిగా విజయ్ కుమార్ నటిస్తారని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

## విజయ్ సేతుపతికి జోడీగా బాలీవుడ్ స్టార్

చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు నటుడు విజయ్ సేతుపతి. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఎడాపెడా చిత్రాలు చేస్తున్నాడు. తెలుగులో పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ మూవీ చేస్తున్నాడు. ప్రస్తుతం వెట్రిమారన్ డైరెక్షన్‌లో శింబు హీరోగా నటిస్తున్న అరసన్ చిత్రంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. అలాగే మరికొన్ని సినిమాల్లోనూ యాక్ట్ చేస్తున్న ఈయన తాజాగా మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. బాలీవుడ్ బ్యూటీ విడాముయుర్చి ఫేమ్ మగిళ్ తిరుమేణి దర్శకత్వంలో సినిమా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటించనున్నట్లు భోగట్టా! ఇకపోతే ఇందులో విజయ్ సేతుపతికి జంటగా బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్‌ను నటింపజేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ ఆఫర్‌కుగానీ ఆమె ఒప్పుకుంటే కోలీవుడ్‌లో మరో క్రేజీ కాంబో షురూ అయినట్లే! మరి ఇదెంతవరకు నిజమన్నది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చేవరకు ఆగాల్సిందే!



## 'స్పిరిట్' భామని రంగంలోకి దించుతున్న నాని?

టాలీవుడ్‌లో మినిమం గ్యారంటీ హీరోగా పేరు తెచ్చుకున్న నాని.. ప్రస్తుతం 'ప్యారడైజ్'తో బిజీగా ఉన్నాడు. మరోవైపు 'ఓజీ' సుజీత్ దర్శకత్వంలో త్వరలో ఓ మూవీని ప్రారంభించబోతున్నాడు. ఇవి కాకుండా మరికొన్ని లైన్‌లో ఉన్నాయి. ఇలా కెరీర్ పరంగా మంచి ఫామ్‌లో ఉన్న నాని.. ఇప్పుడు ఓ బోల్ బ్యూటీతో స్క్రీన్ షేర్ చేసుకునేందుకు సిద్ధమయ్యాడట. పలు హిందీ చిత్రాల్లో నటించిన తృప్తి దిమ్రికి.. సందీప్ రెడ్డి వంగా తీసిన 'యానిమల్' మూవీ ఓవర్‌నైట్ స్టార్‌డమ్ తెచ్చిపెట్టింది. బాలీవుడ్‌లో వరస అవకాశాలు అందుకుంటూ బిజీ అయిపోయింది. ప్రస్తుతం తనకు లైఫ్ ఇచ్చిన సందీప్ వంగా తీస్తున్న 'స్పిరిట్'లో ప్రభాస్‌కి జోడీగా చేస్తోంది. మరి మెయిన్ లీడ్ లేదా సెకండ్ హీరోయిన్ అనేది తెలియాల్సి ఉంది. ఇదలా ఉండగానే ఇప్పుడు నాని చేయబోయే ఓ మూవీ కోసం తృప్తిని హీరోయిన్‌గా అనుకుంటున్నారట. ఒకవేళ ఇదే నిజమైతే తృప్తి.. టాలీవుడ్ ఎంట్రీ చిత్రం ఇదే కావొచ్చు. గత కొన్ని సినిమాలతో పాన్ ఇండియా మార్కెట్‌పై దృష్టి పెట్టిన నాని.. అందుకు తగ్గట్లే బాలీవుడ్‌లో మెల్లమెల్లగా గుర్తింపు తెచ్చుకునే పనిలో ఉన్నాడు. ప్రస్తుతం చేస్తున్న 'ప్యారడైజ్'లోనూ ఓ కీలక పాత్ర కోసం రాఘవ్ జ్యుయెల్ అనే నటుడితో కలిసి పనిచేస్తున్నాడు. ఇప్పుడు తృప్తి పేరు వినిపిస్తుంది. చూడాలి మరి ఇందులో ఎంత నిజముందో?

